

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.

పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై ఆ794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.

భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాథలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపథ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. ఆ794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.

*(గతసంచికతరువాయి)*

**చిన్న సంస్థానాలు,** పెద్ద సంస్థానాల విషయంలో తేడా లేకుండా అందరి విషయంలోనూ నిర్దిష్టంగా ఒకే విధానం ఉండాలని, ఆదాయం వచ్చే సంస్థానాల నుంచి బ్రిటిష్ ప్రభుత్వం పేష్కను (ఆనాటి ఈస్టు ఇండియా కంపెనీ విధించిన పన్ను) వసూలు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని అందుకు సంస్థానాధీశులు అంగీకారం తెలపాలని కోరారు.

బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనను అందరూ అంగీకరించారు.

వీరి నుంచి అంగీకార పత్రాలను ఆమోదముద్ర ఉన్న లేఖలను ఆయా జిల్లా కలెక్టర్లు స్వయంగా స్వీకరించారు. విజయనగరం సంస్థానం నుంచి పరిపాలకునిగా ఉన్న విజయరామరాజు తరపున దివాన్ సీతారామరాజు ఈ పత్రానికి ఆమోద ముద్రవేసి అందించారు.



పద్మనాభం యుద్ధం జరిగిన ప్రాంతంలో చనిపోయిన విజయరామరాజు సమాధి. ఈ సమాధి ప్రాంతం ఒక శిలాఫలకం మాదిరిగా ఉండేది దీని నిపరిరక్షించి చుట్టూ ప్రహారీని నిర్మించి రెండు సెంట్లు స్థలంలో సమాధి ని ఏర్పాటు చేసారు

ఈ ఆమోదపత్రాల ఆధారంగా సంస్థానాల ఆదాయాలను పంపకం చేసే విషయంలో బ్రిటిష్ ప్రెసిడెన్సీ అధికారులు కొన్ని నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడింది. బ్రిటిష్ హైకమీషన్ ఆధ్వర్యంలో చిన్న సంస్థానాల విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలో వాటిని అమలు చేసే విధానం ఏ విధంగా ఉండాలో అనే ఆలోచనలకు రూపకల్పన చేశారు. ఈ నిబంధనలకు బ్రిటిష్ అధికారులు శ్రీకారం చుట్టగా భారతదేశంలో బ్రిటిష్ వారికి అనుకూలంగా పనిచేస్తున్న కొంతమంది ఉత్తర భారతదేశ సంస్థానాధీశులు సలహా సూచనలు అందించారు.

చిన్న సంస్థానాలకు ఆదాయం ఏ విధంగా వస్తుంది. దానిని ఎక్కడ జమ చేస్తున్నారు. రాజ్య పరిపాలన ఏ విధంగా జరుగుతుంది. ఎవరెవరు బాధ్యులుగా ఉంటారన్న విషయాలు భారతదేశంలో బ్రిటిష్ అధికారుల ఆధీనంలో ఉన్న సంస్థానాల పరిపాలకులు కొన్ని వివరాలు అందించారు.

ఈ వ్యవహారాలకు భారతదేశంలో ముఖ్యంగా మద్రాసు రాష్ట్రంలో బ్రిటిష్ విధానాలను పర్యవేక్షణ జరిపే ఫెండర్‌గాస్టు నాయకత్వం వహించారు. ఆయన ఆధ్వర్యంలో ఎనిమిదిమంది బ్రిటిష్ అధికారులకు సంబంధించిన నిర్ణయాలను తీసుకున్నారు.

ఈ నిర్ణయాలను అందరికి తెలియజేయడానికి వాటిని అమలు జరపడానికి వీలుగా ఒక కమిటీ ఏర్పాటు అయింది. ఫెండర్ గాస్టు ఆధ్వర్యంలో ఏర్పడిన బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ కమిటీ పనిచేయడం ప్రారంభించింది. చిన్న సంస్థానాలకు చెందిన రాజులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం సిఫార్సులను అమలు చేయడానికి వీలుగా ఈ కమిటీ పనిచేయాలని సూచనలు వచ్చాయి. అందరూ అంగీకరించే విధంగా బ్రిటిష్ వారికి భారతీయులకు ఉభయతారకంగా ఉండేందుకు కొన్ని ప్రతిపాదనలు తయారుచేయడానికి ఈ కమిటీ మూడు నెలలు కసరత్తు జరిపింది. అక్కడనుంచి రాజముద్రతో వచ్చిన సిఫార్సులను భారతదేశంలో అమలు చేయడానికి సంకల్పించింది దీనికి కూడా ఫెండర్‌గాస్టు నాయకత్వం వహించారు.

విజయనగరం సంస్థానంలో పన్నుల భారం అధికంగా ఉందని ప్రజల దుస్థితికడు దీనంగా ఉందని కమిటీ సిఫార్సులు చేసింది. 1778 అక్టోబరు 6న థామస్ రంబోల్డుకు పూసపాటి సోదరులకు మధ్య ఒప్పందం కుదిరింది. దీనిని అనుసరించి విజయనగరం వారు

రానున్న అయిదు సంవత్సరాలకు చెల్లిస్తున్న రూ.3,29,000లకు అదనంగా మరో లక్షరూపాయలు పెంచి చెల్లించవలసి ఉంటుంది. అనకాపల్లి, సత్యవరం సంస్థానాలను కూడా విజయనగరానికి దాఖలు పరిచి వాటి ఆర్థిక వ్యవహారాలను చూడవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇందువల్ల వీటి కోసం మరో రూ.90వేలు అనకాపల్లి సంస్థానంలో రాణుల కోసం పదివేలరూపాయలు భరణాన్ని అదనంగా చెల్లించాలని కోరారు.

ఆ విధంగా చిన్న సంస్థానాల గురించి సిఫార్సులను తయారు చేసిన కమిటీ పేరుని సర్క్యూట్ కమిటీగా నామకరణం చేశారు. ఈ కమిటీ తీసుకున్న అనేక నిర్ణయాలు సిఫార్సులు అమలు చేయడానికి చేసిన ప్రయత్నాల కారణంగా బ్రిటిష్ వారిపై సంస్థానాధీశుల తిరుగుబాటుకు బీజాలు పడ్డాయి. ఆ సిఫార్సుల అమలు విషయంలోనే పద్మనాభంలో యుద్ధం జరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి.

***విజయనగరం సంస్థానంలో దివాన్ ప్రభావం***

విజయనగరం సంస్థానంలో దివాన్‌గా సీతారామరాజు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ప్రభావం ఎక్కువగా పెరిగిపోయింది. ముందు సాధారణ వ్యక్తిగా ఆ సంస్థానంలోకి వచ్చిన ఆయన తర్వాత కాలంలో బలీయమైన శక్తిగా ఎదిగిపోయారు. అందరూ ఆయన మాటను వేదవాక్కుగా భావించేవారు. ఆయన అనుయాయులుగా చాలామంది మారిపోయారు. దివాణంలో ఏ పని జరగాలన్నా ఆయన సిఫార్సు ఉండాల్సిందే

సీతారామరాజు దివాన్‌గా పదవిలోకి వచ్చిన తర్వాత క్రమక్రమంగా తన ప్రభావాన్ని చాటుకున్నాడు. అతను విజయనగరం మహారాజుగా ఉన్న చిన విజయరామరాజుకు అన్నయ్యగా ఉండటం వల్ల రాజుకు ఎంత విలువ ఉందో అతనికి కూడా అంతే విలువ లభించేది. రాజాస్థానంలో చాలామంది రాజుకన్నా అతనికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు.

విజయనగరంలో దివాన్‌గా చేరిన తర్వాత అతనికి రాజ్యంలో పరిస్థితులు చాలావరకు అర్థం అయిపోయాయి. పరిపాలకుడు చిన్నవాడు తన మాటను జవదాటని వ్యక్తి కావడం అతని ప్రభావానికి ఎక్కువ దోహదపడింది. బాధ్యతల్ని తీసుకున్న రెండేళ్ళవరకు సీతారామరాజు సాధారణమైన ఉద్యోగిగా వ్యవహరించినా తర్వాత ఆయనతో పనులు చేయించుకునేవారు ఎక్కువ అయ్యారు. పన్నులు కట్టాలన్నా, తగ్గించాలన్నా, పేదరికంలో ఉన్నారని పన్నులను రద్దుచేయాలన్నా దివాన్ నిర్ణయం తీసుకోవలసిందే దివాన్ ఎంత చెబితే రాజుకు అంతే అన్న భావన విజయనగరం సంస్థానంలో ప్రచారం జరిగిపోయింది. ఈ కారణంగానే అతనికి విలువ కూడా సామాన్యుల వద్ద సామంతరాజుల వద్ద ఎక్కువ అయింది.

విజయనగరానికి అనుబంధంగా ఉన్న చిన్న రాజ్యాలకు సంబంధించిన వ్యవహారాలు కూడా సీతారామరాజు చూసేవారు. ఆయన ఎక్కడైనా ఏదైనా నిర్ణయం తీసుకున్నా దానికి అడ్డుచెప్పడానికి అవకాశం ఉండేది కాదు. రాజు కూడా అతని మాటను కాదనలేని పరిస్థితిలో ఉండటంవల్ల అందరూ అతని వెనుకే నడిచేటట్లు ఉండేవారు.

ఆ రోజు..

దివాన్ సీతారామరాజు దివాణంలో కొలువులో ఉంటుండగా కొటవురట్ల సంస్థానం నుంచి సత్యనారాయణరాజు అనే రాజు వచ్చారు. అతను ఆ ప్రాంతంలో పలుకుబడి కలిగిన చిన్న సమస్థానాధీశుడు. లోపలికి తీసుకునిరాగానే సాదరంగా ఆహ్వానం పలికాడు.

"విజయరామరాజుగారిని కలుసుకోవాలి" అభ్యర్థించాడు.

"ఎందుకు?"

"మా సంస్థానంలో ఇటీవల వరదలు వచ్చి పంటలన్నీ నీట మునిగిపోయాయి. నూటయాభై ఎకరాలు వరిపంట నాశనమైపోయింది. నీటిలో నానిపోయి ఎందుకూ పనికిరాకుండా అయిపోయింది."

"అయితే"

"అందుకే దివాణం వారిని కలుసుకుందామని ఆయనగారికి మా సమస్యని విన్నవించుకుందామని వచ్చాను."

"ఎందుకు?"

ఆ వ్యక్తి ఏమీ మాట్లాడలేదు. సందేహిస్తూ దిక్కులు చూడటంతో దివాన్ వద్ద నున్న శిరస్థార్ రమణ "ఏమైనా సహాయం కావాలని వచ్చారా?" అని అడిగాడు.

"మాది కోటవురట్ల ప్రాంతం. మొదటినుంచి విజయనగరం సంస్థానం పరిధిలో రాజుగారికి అనుకూలంగా ఉంటోంది. పంటలు పోయినందున శిస్తులు కట్టలేమని రైతులు విన్నవించుకుంటున్నారు. వారి నుంచి బలవంతంగా శిస్తులను వసూలు చేయించడం కష్టం. వారు శిస్తులు కట్టకపోతే తమకు కోటవురట్ల నుంచి ఖజానాకు చెల్లించవలసిన భూమి శిస్తులు పన్నుల సొమ్ము వాటా చెల్లించడం కష్టం అవుతుంది. ఈ విషయాన్ని రాజుగారికి తమరే విన్నవించాలి" ఆ వ్యక్తి అభ్యర్ధించాడు.

శిరస్థార్ ఈ మాటలని విని "రాజుగారికి తమ విన్నపాలు చెప్పమంటారా?" అని మెల్లగా అడిగాడు.

ఆ మాట విని అక్కడే ఉన్న దివాన్ ఉగ్రుడైపోయాడు. "మీ పని చూసుకోండి" అని రమణవైపు కోపంగా చూసి "డబ్బులు కట్టలేమని చెప్పడానికి అంతదూరం నుంచి ఇక్కడికి వచ్చేశారా" అని వ్యంగ్యంగా ప్రశ్నించాడు.

"చిన విజయరామరాజుగారు ఎంతో ఉదారస్వభావం కలిగినవారని విన్నాం. మా సమస్యని వింటే వారు ఎంతో మంచిగా పరిష్కరిస్తారు. మా ప్రాంతీయులంతా నిరుపేదలు అయినందున వారు కట్టవలసిన పన్నులు కూడా శ్రీవారు రద్దు చేసినా చేస్తారు" అన్నాడు.

"అందుకనా తమరు అంతదూరం నుంచి పని కట్టుకుని వచ్చారు"

ఆ వ్యక్తి మళ్ళీ మౌనం వహించారు.

దివాన్ సీతారామరాజు గొంతుని సవరించుకుని "చినరాజావారు ఇప్పుడు ఎవర్నీ కలుసుకునే స్థితిలో లేరు. ఆయన్ని కలుసుకోవడం వల్ల కూడా తమకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. ప్రజలు పంటలు వేశారు. కష్టపడి పండించుకున్నారు. ఆ పంట వారికి దక్కలేదూ అంటే వారు ఎంతో దురదృష్టవంతులని అర్ధం చేసుకోవాలి. దానికి ఎవరూ ఏమీ చేయలేం. ఆఖరికి ఈ ప్రభువులు గారు కూడా ఏమీ సాయం చేయరు. చేయలేరు. ఒకసారి ఒక ప్రాంతంవారికి సాయం చేసుకుంటూ పోతే అన్ని ప్రాంతాల వారికీ ఎప్పుడో ఏదో అపాయం, కష్టం వస్తూనే ఉంటుంది. వారందరికి సహాయాలు చేసుకుంటూ పోతుంటే ఖజానా సరిపోదు. అందువల్ల మీ రైతులు దివాణానికి చెల్లించవలసిన పన్నులు అన్నీ సకాలంలో చెల్లించాలి. కావాలంటే అయిదువారాల గడువు ఇతరప్రాంతాలకన్నా ఎక్కువగా ఇస్తాం." సమాధానం ధృఢంగా చెప్పాడు.

ఈ మాటలు విని కోటవురట్ల గుర్రాల బగ్గీపై వచ్చిన సత్యనారాయణరాజు ఖిన్నుడైపోయాడు. దివాన్ అంత ఖరాకండిగా మాట్లాడుతుంటే ఏమి జవాబు చెప్పాలో అర్ధంకాలేదు. ఇంతలో పనివారు వెండిచెంబులో పలచని మజ్జిగ తెచ్చి ఇచ్చారు. దానిని తాగి "పోనీ ఒకసారి చినరాజాగారిని కలుసుకుని వెళ్ళిపోతాను" అభ్యర్ధించాడు.

ఆ అభ్యర్ధన దివాన్ చెవిని పడలేదు.

"మీరు చెప్పిన విషయం మీ కోటవురట్ల పరిస్థితిని రాజుగారికి వివరిస్తాను తమరు దయచేయండి" దివాన్ నెమ్మదిగా చెప్పాడు.

దివాన్ మాటకు ఎదురు ఉండదని అతను అక్కడికి వచ్చేముందు విజయనగరంలో విన్నాడు .కానీ అంతలా ఉంటుందా అని మొదటిసారి అర్ధం అయింది. నెమ్మదిగా భారంగా వెనక్కి వచ్చాడు. అతనితోపాటు అక్కడి దివాణానికి వచ్చిన ఇతర సిబ్బంది కూడా రాజుగార్ని అనుసరించారు.

కోటగుమ్మం దాటేంతవరకు వెంట వెళ్ళమని శిరస్థార్‌తో చెప్పాడు. దివాన్ సీతారామరాజు. కోటవురట్ల రాజు వెళ్ళిన తర్వాత దివాన్ వెనక్కి తిరిగి దివాణం సమావేశం మందిరంవైపు బయలుదేరాడు. దివాన్ ఎదురుగా తనవైపు రావడం చూసి "ఎవరు వచ్చారు" అని ప్రశ్నించారు విజయరామరాజు.

రాజుగారు అడిగిన ప్రశ్నకు సమాధానం అతను చెప్పలేదు.

"అనేకమంది దివాణంలోకి వస్తుంటారు. తమకు అవసరమైన వారినే పంపిస్తాం. తమకు అనవసర తలనొప్పులు ఎందుకన్నది మా ఆలోచన" దివాన్ చాకచక్యంగా సమాధానం చెప్పాడు.

"అవును నిజమే. అన్నయ్య చెప్పిన విషయం సరైనదే అతను ఏది చెప్పినా తన మంచికోసమే చెబుతాడు. దానిని తాను ఎందుకు కాదనాలి" మనసులోనే అనుకున్నాడు. విజయరామరాజు.

ఆ విషయం గురించి మరి ఏమీ మాట్లాడలేదు.

***దివాన్‌జీగా పెరిగిన గౌరవం***

సీతారామరాజు విజయనగరం సంస్థానంలో దివాన్‌గా చేరిన తర్వాత క్రమక్రమంగా తన గౌరవాన్ని పెంచుకున్నాడు. విజనగరం సంస్థానానికి అనుబంధంగా ఉన్న వివిధ దివాణాలకు అతను సంధానకర్తగా వ్యవహరించేవాడు. ఏ వ్యవహారాలు అయినా దివాన్ సీతారామరాజు చూసే విధంగా అక్కడ సిబ్బందిని తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. కిందిస్థాయిలో చాలామంది కీలకమైన వ్యక్తులు కూడా సీతారామరాజు మాటను జవదాటని పరిస్థితిలో ఉండేవారు.

మొదట్లో దివాన్‌గారు అనే సంభోదన ఉండేది. క్రమక్రమంగా అది దివాన్‌జీగా మార్పు చెందింది. ఆ సమయంలో బ్రిటిష్‌వారు తాము గౌరవించే వ్యక్తుల పేరు ముందున సర్ అని చేర్చి పిలిచేవారు. ఆ విధానం ఇబ్బందిగా ఉంటుందని దివాన్ సార్ అని తనని పిలిచే అవకాశం ఉండదని భావించాడు. సర్ అని రాజ్యాన్ని పరిపాలించేవారికే ఉంటుందని తన పేరు ముందు దివాన్‌జీ అని తగిలించుకుని ఎవరు తనని పిలవాలనుకున్నా దివాన్‌జీ అని పిలవాలని చెప్పేవారు.

ఈ విషయాలను కోటలో ఉన్న తన సహచరులకు, పరిచారికలకు తెలియజేసారు. తన ఆదిపత్యం చెల్లాలని వేగులను నియమించుకున్నాడు మొత్తం సైనికుల్ని తనవెంట తిప్పుకునేవిధంగా ప్రణాళిక తయారు చేసుకున్నాడు.

ఆ సమయంలో నిర్మాణం జరిగిన సాగునీటి కాల్వకు తన పేరు పెట్టాలని కొంతమంది కింది స్థాయి సిబ్బందికి సూచనలు అందించడంవల్ల దివాన్‌జీ కాల్వ వెలిసింది.

ఈ దివాన్‌జీ కాల్వ నిర్మాణ సమయంలో జరిగిన కొన్ని విషయాలు కూడా విజయరామరాజు పరిపాలనలో కొంతమంది కిందిస్థాయి సిబ్బందికి ఇబ్బందిగా తయారైంది. రాజుగారికి సంబంధం లేకుండా ఈ కాల్వ నిర్మాణానికి నిధులు విడుదల చేసి వందలాదిమంది రైతులకు ఉపయోగపడే కాల్వని నిర్మించినప్పటికీ దానికి రాజులకు ఏ మాత్రం సంబంధం లేకుండా అయిపోవడాన్ని దివాణంలో చాలామంది తట్టుకోలేకపోయారు.

ఈ విషయాన్ని విజయరామరాజు దృష్టికి తీసుకుని వచ్చారు.

"రైతుల భూములకు ఉపయోగపడే కాల్వ ఎవరు నిర్మించినా మంచిదే కదా. అన్నయ్యపైన అపోహలు వద్దు. దివాన్‌గా ఆయనకున్న విచక్షణ వల్ల ఈ కాల్వ నిర్మాణం సాకారం జరిగింది. ఇందులో మీరు ఆందోళన చెందవలసిన అవసరంలేదు" అని సున్నితంగా చెప్పివారిని పంపించి వేశారు.

ఈ విషయం ఆ తర్వాత దివాన్ సీతారామరాజుని పిలిచి అడిగారు.

"తమరు నిర్మిస్తున్న కాల్వ ఎంతోమంది రైతులకు ఉపయోగపడుతుంది కదా. చాలామంది రైతులు ఆనందపడుతుంటే మన దివాణంలో కొంతమంది తమ మీద అపోహలు పడుతున్నారు. ఎందువల్ల." అని.

దివాన్ రాజుగారి ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

"ఈ విషయం తమరి వద్దకు వచ్చిందా. ఇటువంటి చిన్న విషయాలు తమ దృష్టికి తీసుకుని రాకూడదని ఊరుకున్నాను. చాలామందికి ఉపయోగపడే పనులు చేయడం వల్ల కొంతమందికి ఇష్టంలేనట్లుగా ఉంది. అందువల్ల వారు తమ వద్దకు వచ్చి నాపై ఈ విధంగా పిర్యాదు చేస్తున్నారని అనుకుంటున్నాను."

"అవును.. అవును.. అదే కావచ్చు."

"అలా చెప్పినవారు మన దివాణంలో వారా? ఇతరులా?"

చిన విజయరామరాజులో కొద్దిపాటి అమాయకత్వం ఉంది. దివాన్ అడుగుతున్న విషయాలు ఎందుకని కాని అతనికి ఆ విషయాలు చెప్పకూడదని కానీ అనుకోలేదు. చిన్నగా గొంతుని సవరించుకుని "మన సామంతరాజులు కొంతమంది ఈ విషయాలు నా దృష్టికి తీసుకుని రావాలని కోరారు. ఇక్కడివారు ఈ విషయాలను చెప్పారు. ఇందులో విశేషం ఏముంది?" అన్నారు.

"ఉంది చినరాజావారూ. ఈ విషయాలు చెప్పి తమకు నాకూ మధ్య కొంత మంది విబేధాలు సృష్టించాలని అనుకుంటున్నట్లు నాకు అనుమానం కలుగుతోంది. దీనిని మనం మొదట్లోనే తుంచకపోతే రానున్న కాలంలో ఇద్దరి మధ్య అడ్డుగోడలు పెరిగిపోయే ప్రమాదం ఉంది. సామంతులు విభేదాలు కల్పించి విడదీసే ప్రయత్నాలు చేస్తారు" అన్నాడు దివాన్ ఆవేశంగా.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments